క్లుప్తంగా

ప్రణాళికల రూపకల్పనే విజయ రహస్యం



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ ఇమ్మానుయేల్

తుని: ప్రణాళికలను రూపొందించి వాటిని అమలు చేయడమే విజయ రహస్యమని ఐజీ, హైదరాబాదు నిసా (ఎస్‌ఐఎస్‌ఎఫ్) డైరెక్టర్ కె.సునీల్ ఇమ్మానుయేల్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే అడ్డంకులపై కాకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలన్నారు. కఠోర శ్రమ, దెబ్బ తగిలినా లేచి నిలబడి ప్రయత్నించే గుణం, లక్ష్యంపై నిబద్ధత కలిగి ఉండాలన్నారు. పుస్తకాలు చదవడం, వార్తా పత్రికల్లో ఎడిటోరియల్ చదివి వాటిపై రివ్యూ రాయడం నేర్చుకోవాలని సూచించారు. అత్యుత్తమస్థాయి కోసం ప్రయత్నించని వారు అసాధారణంగా ఎదగలేరని స్పష్టం చేశారు. శ్రీప్రకాష్ సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపల్స్ మూర్తి, రామకృష్ణారెడ్డి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని రాచపల్లి సమీపంలోని పోలవరం కాలువ గట్టు వద్ద అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం బుధవారం తెలిపారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామం నుంచి అల్లు దుర్గాప్రసాద్ బైక్‌పై సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని నుంచి బైక్‌తో పాటు 70 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు.

అక్రమాలు అరికట్టడంలో నిర్లక్ష్యం వహించవద్దు

తుని రూరల్: నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుక, ఇతర అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులదే బాధ్యత అని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన రెవెన్యూ, పోలీస్, పోలవరం ఎడమ కాలువ, మైనింగ్ అధికారులను ఉద్దేశించి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా విభాగాలు నిఘా ఉంచి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలన్నారు. ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనుమతులు లేకుండా ఇసుక, గ్రావెల్ తరలించే వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. అక్రమాలను అరికట్టడంలో అధికారులు అలసత్వం వహిస్తే దండన తప్పదని హెచ్చరించారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ పాలక వర్గాన్ని ప్రకటించింది. ఎమ్మెల్యే నెహ్రూ పాలకవర్గంలో చోటు దక్కించుకున్నారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు పసుపు, ములగాకు, బచ్చలి, తిప్పతీగ, ఉత్తరేణి, నేల ఉసిరి, తమలపాకు, కలబంద, రణపాల తదితర ఔషధ గుణాలు కలిగిన మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, సూపర్‌వైజర్ అమ్మాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపీఏలకు పదోన్నతులు



పదోన్నతులు పొందిన వీపీఏలను అభినందిస్తున్న ఏఓ అమృత

కిర్లంపూడి: మండలంలో వీపీఏలుగా విధులు నిర్వహించిన పలువురు పదోన్నతులు పొందారు. వీపీఏలు ఆకుల సురేష్, పైలా మౌళీ, కాళ్ల బలరాం ఏఈఓలుగా పదోన్నతులు పొంది ఇతర మండలాలకు బదిలీపై వెళారు. కాగా పదోన్నతులు పొందిన వీపీఏలను ఏఓ జోకా అమృత అభినందించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

ఆనంద కేళి.. దీపావళి

- దివ్వెల పండగకు సర్వం సిద్ధం
- గ్రామాల్లో సందడి వాతావరణం
- జోరుగా బాణసంచా సామగ్రి విక్రయాలు



కిర్లంపూడిలో బాణసంచా విక్రయాలు



ఏలేశ్వరంలో బాణసంచా విక్రయిస్తున్న వ్యాపారులు

ఏలేశ్వరం: తమ జీవితాల్లో చీకట్లను పారద్రోలి వెలుగులు నింపాలని కోరుతూ జరుపుకొనే దీపావళి పండగకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలోని గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. వెలుగుల పండగను కుటుంబ సభ్యుల నడుమ ఆనందంగా జరుపుకునేందుకు దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు సొంతూళ్లకు తిరిగివచ్చారు.

18 బాణసంచా దుకాణాల ఏర్పాటు

దీపావళిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో బుధవారం బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఏలేశ్వరంలోని యర్రవరం రోడ్డు లింగవరం కాలనీ సమీపంలో 16, మండల పరిధిలోని జె.అన్నవరం, యర్రవరంలో రెండేసి చొప్పున బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీపావళి పండగకు ఒక్క రోజే ఉండడంతో అమ్మకాలు జోరందుకున్నాయి. చిన్నారులతో కలిసి పెద్దలు వివిధరకాల సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు అప్రమత్తమయ్యారు. దుకాణాల వద్ద ఎటువంటి ప్రమాదం జరగకుండా వాటర్, ఇసుక, తదతర వాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఏజెన్సీ ముఖద్వారం కావడంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు మండల కేంద్రం అవ్వడంతో అధిక సంఖ్యలో కొనుగోలు దారులు వచ్చే అవకాశం ఉంది.

భారీగా పెరిగిన ధరలు

దీపావళి సామగ్రి ధరలు ఆకాశానంటుతున్నాయి. ఏటా ధరలు పెరుగుతుండడంతో కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు. సంప్రదాయం ప్రకారం పండగ జరుపుకోవాల్సి ఉండడం, పిల్లలతో పడలేక నామమాత్రంగా కొనుగోలు చేస్తున్నారు. దీపావళిని పురస్కరించుకుని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. బాణసంచా దుకాణాలను ఎస్సై రామలింగేశ్వరరావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను దుకాణదారులకు వివరించారు.

ప్రత్తిపాడు రూరల్: దీపావళిని పురస్కరించుకొని మండలంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. ప్రత్తిపాడు మండలంలో 16 బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రత్తిపాడులో 4, ధర్మవరంలో 8, ఒమ్మంగి 2, ఉత్తరకంచి 2 చొప్పున బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. బాణసంచా సామగ్రి ధరలు పెరగడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్తిపాడు ఫైర్ స్టేషన్ పరిధిలో 47 టపాసుల దుకాణాలు

ప్రత్తిపాడు: దీపావళి సందర్భంగా ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని 49 టపాసుల దుకాణాలకు అనుమతులిచ్చినట్టు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రామకృష్ణరాజు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో 16, ఏలేశ్వరం మండలంలో 16, శంఖవరం మండలంలో 5, రౌతులపూడి మండలంలో 4, కిర్లంపూడి మండలంలో 6 వెరసి 49 బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. బాణసంచా, పూజ సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. వ్యవసాయ కార్మికులు, చిరు వ్యాపారులు, అసంఘటిత కార్మికులు, పేదలు తదితరులు తమకు తోచిన రీతిలో దీపావళి జరుపుకోవడానికి సమాయత్తమయ్యారు. మహిళలు రంగవల్లులు కొనుగోలు చేస్తున్నారు. ఇంటి ఆవరణ, ద్వారాల వద్ద ప్రమిదలతో దీపాలు వెలిగించేందుకు రకరకాల ప్రమిదెలు కొనుగోలు చేశారు. ఈ ఏడాది బాణసంచా సామగ్రి ధరలు అందుబాటులో లేవు. గతేడాది కంటే పది శాతం ధరలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.



ప్రత్తిపాడులో వెలసిన టపాసుల దుకాణాలు

పల్లెకు పండగ శోభ

కిర్లంపూడి: గ్రామాల్లో దీపావళి పండగ శోభ సంతరించుకుంది. వెలుగుల పండగ దీపావళిని ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలంతా ఎంతో ఉత్సాహంతో ఏర్పాట్లు చేసుకున్నారు. బుధవారం వారపు సంత కావడంతో కిర్లంపూడిలోని వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు, కిరాణా దుకాణాల్లో కొనుగోలు, అమ్మకాలు జోరుగా సాగాయి. బాణసంచా దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. బాణసంచా ధరలు మాత్రం ఆకాశాన్ని అంటడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఉన్నంతలోనే సంతృప్తి పడాల్సిన పరిస్థితి నెలకొంది. మట్టి ప్రమిదలు, కొవ్వొత్తుల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. ఆలయాలు, ఇళ్లు, షాపులు విద్యుత్ దీపాలంకరణతో కనువిందు చేశాయి.

నిబంధనలు పాటించాల్సిందే..



బాణసంచా విక్రయాలపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ఇసుక బకెట్లను, నీటి డ్రమ్ములను దగ్గరలో ఉంచుకోవాలి. షాపుల వద్ద నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆల్కహాల్‌తో తయారు చేసే శానిటైజర్లకు మండే స్వభావం ఉండడం వల్ల దుకాణాల వద్ద ఉంచుకోకూడదు. బాణసంచా వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.

– బి సూర్య అప్పారావు, సర్కిల్ ఇనస్పెక్టర్, ప్రత్తిపాడు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కిర్లంపూడిలో బాణసంచా దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్సై

కిర్లంపూడి: బాణసంచా దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జె.చిరంజీవి హెచ్చరించారు. కిర్లంపూడి నూకాలమ్మ ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను స్థానిక ఎస్సై జి.సతీష్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా షాపులు నిర్వహించినా, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి షాపు వద్ద నో స్మోకింగ్, ధరల బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

గోకవరం: మండలంలోని బాణసంచా వ్యాపారస్తులు దుకాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలని గోకవరం ఎస్సై పవన్‌కుమార్ సూచించారు. మండలంలో గోకవరం, కొత్తపల్లి, కామరాజుపేట, తంటికొండ గ్రామాల్లో 21 బాణసంచా షాపులకు అధికారులు అనుమతులు ఇచ్చారు. వీటిలో గోకవరంలో 14, కొత్తపల్లిలో నాలుగు, కామరాజుపేటలో మూడు, తంటికొండలో ఒక్క షాపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయా గ్రామాల్లో షాపులను పరిశీలించి భద్రతా చర్యలను సమీక్షించారు. షాపుల వద్ద విధిగా నీటి వసతి ఏర్పాటు చేసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు.

పశుగణనకు రైతులు సహకరించాలి



ప్రత్తిపాడులో పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, అధికారులు

ప్రత్తిపాడు/ఏలేశ్వరం: నియోజకవర్గంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పశుగణనకు పాడి రైతులు సహకరించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. ప్రత్తిపాడులో బుధవారం పశుగణన వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు రైతుల ఇంటి వద్దకు వచ్చి పశుగణన సమాచారం సేకరిస్తారన్నారు. రైతులు పశువైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చిక్కం బాలచంద్రయోగేశ్వర్ మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకూ పశు గణన కొనసాగుతుందన్నారు. పశువైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తారని, పాడి రైతులు సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబులను పశువైద్యాధికారులు కలిశారు. గ్రామాల్లో పశుగణనకు రైతులు సహకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంఖవరం ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పి.మనోజ్‌కుమార్, ధర్మవరం, శంఖవరం, రౌతులపూడి, ఒమ్మంగి, ములగపూడి ప్రభుత్వ పశు వైద్యశాలల అధికారులు సుంకర వరలక్ష్మి, కె.లావణ్య, ఎం.వీరరాఘవరావు, ఇ.సతీష్‌కుమార్, విభ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం: గ్రామాల్లో చేపట్టనున్న పశుగణనకు రైతులు సహకరించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. మండల పశువైద్యాధికారి ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పశుగణన వాల్ పోస్టర్‌లను ఎంపీపీ బుజ్జి ఆవిష్కరించారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

జగ్గంపేట: నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా గ్రామ పునర్నిర్మాణ సంస్థ (వీఆర్‌ఓ) పని చేస్తోందని ఆ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. జగ్గంపేట శివారులోని వీఆర్‌ఓ సంస్థ కార్యాలయంలో బుధవారం 45 రోజుల పాటు టైలరింగ్, కంప్యూటర్ ట్రైనింగ్, డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకున్న యువకులు, మహిళలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ రంగాల్లో శిక్షణ తీసుకున్న 120 మంది త్వరలోనే ఉపాధి పొందుతారని తెలిపారు. త్వరలో మరో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామని చెప్పారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాలకు చెందిన వారు శిక్షణ పూర్తి చేసుకున్నారు. కార్యక్రమంలో జగ్గంపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జోత్స్న, వీఆర్‌ఓ సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల గుర్తింపుతో మెరుగైన ఫలితాలు



కోటనందూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కోటనందూరు: వరి సాగులో తెగుళ్లను గుర్తించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఏఈఓ సురేష్ అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో తెగుళ్ల గుర్తింపు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మితిమీరిన పురుగు మందులను వినియోగించడం వల్ల భూమి నిస్సారమైపోయే ప్రమాదముందని సూచించారు. అనంతరం వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ గాంధీ

చిరుధాన్యాల సాగుతో లాభాలు

శంఖవరం: రైతులు చిరుధాన్యాల సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని గొంది, రాజారం గ్రామాల్లో రైతులకు బుధవారం చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగి, జొన్న, కొర్ర, సామ వంటి పంటలు పండించడం ద్వారా లాభాలు పొందవచ్చన్నారు. ఈ పంటలకు చీడపీడల బెడద తక్కువ అని, వీటిలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గండేపల్లి: మండలంలోని గండేపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం...అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన భార్యభర్తలు రాజమహేంద్రవరం బంధువులు ఇంటికి వెళుతుండగా గండేపల్లి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోయారు. దీంతో వీరి వెనకే వస్తున్న వాహనం వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త బొడపర్తి నూకరాజు కాలికి తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో రాజనగరం జీఎస్ఎల్ ఆస్పత్రికి తరలించారు.

ఆదర్శప్రాయుడు వల్లభాయ్ పటేల్

తుని రూరల్: దేశ సమగ్రతను కాపాడడంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ నిర్వహించిన పాత్ర ఆదర్శనీయమని తుని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత అన్నారు. మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలు (రాష్ట్రీయ ఏక్తా దివాస్) నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు సమైక్యంగా ఉండి దేశ ఐక్యతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసు, అధ్యాపకులు బి.నాగరాజు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో..

తొండంగి: దేశ తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ ఆధ్వర్యంలో వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వదేశీ సంస్థానాలను విలీనం చేయడంలో పటేల్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.దివాకర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం



తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులకు వ్యాసరచన, 2కే రన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, డీన్ కిషోర్, వైకేఎస్ సుబ్బారావు, రమేష్, గంగాధర్, శంకర్, ధర్మరాజు, ఎం.రఘునాథ్, ఆర్ శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సూరంపాలెం ఆదిత్యలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల మరమ్మతులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల కొలగింపు కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. పట్టణంలోని బ్యాంకు కాలనీ, కొత్తపేట, కోర్టు వీధి, పార్క్‌సెంటర్, సినిమా రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంటు ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

తొండంగి మండలంలో...

తొండంగి: మండలంలోని ఏవీ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ వీరభద్రరావు బుధవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని కొమ్మనాపల్లి, ఏవీ నగరం, శృంగవృక్షం, సీతారాంపురం, పెరుమాళ్లపురం పరిసర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహ, పరిశ్రమల వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

జోరుగా అనధికార బాణసంచా విక్రయాలు



కోటనందూరులో ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

కోటనందూరు: మండలంలోని అనధికార బాణసంచా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతి లేకుండా బాణసంచా విక్రయించకూడదని ప్రభుత్వం, అధికారులు ప్రకటనలు చేస్తున్నా..వ్యాపారులు ఆ ప్రకటనలను పెడచెవిన పెడుతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఫ్యాన్సీ, కిరాణ దుకాణాల్లో యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. మరికొంతమంది ఇళ్ల నుంచే విక్రయాలు చేస్తున్నారు. కొంత మంది వ్యాపారులు అనుమతి కోసం దరఖాస్తు చేసుకొని అనుమతులు రాకుండానే భారీస్థాయిలో దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. దుకాణాల వద్ద ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకుండానే అమ్మకాలు చేస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేలా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్వచ్ఛ దీపావళిపై అవగాహన



తునిలో స్వచ్ఛ దీపావళిపై ప్రచారం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుని: దీపావళి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించని గ్రీన్ కాకర్లనే కాల్చాలని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటరావు పట్టణ ప్రజలకు సూచించారు. స్వచ్ఛ దీపావళి..శుభ దీపావళి కార్యక్రమంపై బుధవారం మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ దీపావళి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జీరో వేస్టు పండుగల నిర్వహణపై కమిషనర్ వెంకటరావు, శానిటరీ ఇనస్పెక్టర్, పారిశుద్ధ్య మేస్త్రిలు, కార్మికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవినీతి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అవినీతి నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, పవర్ గ్రిడ్ డీజీఎం పవన్ కుమార్, హెచ్‌ఆర్ ఎఎస్ఎన్ మూర్తి, మేనేజర్ జె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గండేపల్లి: మతిస్థిమితం లేని, గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని మురారి పుష్కర కాలువ వంతెన సమీపంలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుడి మృతదేహాన్ని బుధవారం గుర్తించామన్నారు. మృతుడు నాచు రంగు లోయర్, సిమెంట్ రంగు బనియన్, ఎరుపు, నీలం రంగు బనియన్ ధరించి ఉన్నట్టు తెలిపారు. మెడలో నలుపు రంగుతాడు, కుడి చేతికి తెలుపు రంగుతాడు, కుడి చేతిపై (మో చేతి కింద) శ్రీరామ్, కుడి చేయి దండపై పులి బొమ్మ పచ్చబొట్లు ఉన్నట్టు వివరించారు. మృతుడు గత మూడు రోజులుగా గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరించినట్టు పేర్కొన్నారు. గ్రామ వీఆర్వో పేరూరి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96529, 94409 04841, 08852 294100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

శైవక్షేత్రాలకు కార్తీక శోభ

తొండంగి: మండలంలోని శైవక్షేత్రాలు కార్తీక మాస శోభను సంతరించుకున్నాయి. తొండంగి రామలింగేశ్వరస్వామి ఆలయం, ఒంటిమామిడి విశ్వేశ్వరస్వామి ఆలయం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, బెండపూడి, అద్దరిపేట, పంపాదిపేట, పైడికొండ, పి.ఇ.చిన్నాయపాలెం శివాలయాల్లో కార్తీక సోమవారాలతో పాటు పర్వదినాల్లో రుద్రహోమాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వీటితో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.